# పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలుద్దాం!

## అమెరికా సామ్రాజ్యవాదుల అండతో ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధాన్ని ఖండిద్దాం!!

**– సిపిఐ(ఎం–ఎల్) పిలుపు**

**106** సంవత్సరాలుగా పాలస్తీనా ప్రజలు తమ మాతృభూమి రక్షణ కోసం, తమ అస్థిత్వం కోసం చేస్తున్న పోరాటం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఇజ్రాయెల్ సాగిస్తున్న వరుస దాడులకు, నరమేధానికి వ్యతిరేకంగా గాజాను పాలిస్తున్న 'హమాస్' సంస్థ అక్టోబరు 7వ తేదీన మెరుపు దాడులకు పూనుకుంది. గొప్ప మిలిటరీ శక్తిగా అహంభావం ప్రదర్శించే ఇజ్రాయెల్ ఈ ప్రతిఘటనతో ఉలిక్కిపడింది.

దొంగే, "దొంగ, దొంగ" అని అరిచిన చందంగా అతి పెద్ద టెర్రరిస్టు అయిన ఇజ్రాయెల్, 'హమాస్' సంస్థను టెర్రరిస్టుగా చిత్రించింది. ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు 'హమస్‌లంతా మరణించినవారే" అని చెబుతూ వచ్చిన మాటలు నిజం కాదనీ, పాలస్తీనా ప్రజల పోరాట కొనసాగింపును ఈ ఘటనలు ప్రపంచం ముందుకు మరోసారి చర్చకు తెచ్చాయి.

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత పాలస్తీనా భూభాగం బ్రిటన్ ఆధీనంలోకి వచ్చింది. అరబ్బు ప్రజలు ప్రధానంగా నివసించే ఈ భూభాగంలోకి బయటి నుండి యూదులను తనే ప్రోత్సహించి చేర్చింది. పాలస్తీనాలోనే యూదుల కోసం ప్రత్యేక రాజ్యం ఏర్పాటుకు బ్రిటన్ చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా 1935లోనే గాంధీతో సహా ఆనాటి జాతీయోద్యమ నాయకత్వ మంతా మాట్లాడింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిశాక బ్రిటన్, అమెరికాలు పూనుకుని ఐక్యరాజ్య సమితిలో తెచ్చిన 'ఇజ్రాయెల్' దేశ ఏర్పాటు తీర్మానం 181కి వ్యతిరేకంగా 1948లో నెహ్రూ ప్రభుత్వం ఓటు వేసింది. ఆ తర్వాత కాలంలో పాలస్తీనా ప్రజా ఉద్యమ నాయకుడైన యాసర్ అరాఫత్‌ను మన పాలకులు ఆ దేశ ప్రధాని హోదాలో గుర్తించారు కూడా.

ఈ చరిత్రనంతా పక్కన పెట్టిన మోడీ, ఇజ్రాయెల్ దురాక్రమణదారులకు వత్తాసుగా, వారికి అండగా వుంటామంటూ ప్రకటనలు విడుదల చేస్తున్నాడు. అమెరికన్ సామ్రాజ్యవాదుల కనుసన్నలలో నడుస్తున్నాడు.

1948లో కేవలం 55 శాతం భూభాగంతోనే ఇజ్రాయెల్ ఏర్పడగా, ఇపుడు దాన్ని 80 శాతానికి ఇజ్రాయెల్ విస్తరించింది. 365 చ.కి.మీ.ల విస్తీర్ణం వున్న గాజా ప్రాంతంతో పాటు వెస్ట్ బ్యాంక్, జెరూసలేంలు మాత్రమే మిగిల్చారు. ఆ భూభాగాల నుండి ఇజ్రాయెల్ సేనలు వైదొలగాలన్న ఐక్యరాజ్య సమితి తీర్మానాలను కూడ ఇజ్రాయెల్ అమలు జరపకుండా మొండికి వేస్తున్నది. అమెరికా దానికి అండగా నిలుస్తూ ఐక్యరాజ్య సమితిలో చర్చకు వచ్చే తీర్మానాలన్నిటినీ వీటో చేస్తున్నది.

ఆయిల్ వనరులకు కేంద్రంగా, అరబ్బు దేశాల మధ్య వున్న ఇజ్రాయెల్‌ను ఒక అప్రకటిత మిలిటరీ స్థావరంగా అమెరికా వాడుకుంటూ, ఆయిల్ వ్యాపారంపై తన పట్టును కాపాడుకు నేందుకు, తన ఆధిపత్య యుద్ధ వ్యూహాన్ని అమలు పరుస్తోంది. పాలస్తీనా ప్రజలకు అండదండలుగా వుంటూ వచ్చిన అరబ్బు దేశాలను విడగొట్టి, ఇజ్రాయెల్‌తో స్నేహ సంబంధాలు పెంచే వ్యూహాన్ని అనుసరిస్తోంది.

మధ్యప్రాచ్యంపై పట్టు కోసం అమెరికా సాగిస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా రష్యా, చైనాలు కూడ తమ ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు తగిన ఎత్తుగడలు అనుసరించడం ద్వారా 'ఏకధృవ ప్రపంచం' అన్న పరిస్థితిని సాధ్యంకాకుండా చేస్తున్నాయి.

హమాస్ ప్రతిఘటనకు ప్రతిగా గాజాపై ఇజ్రాయెల్ దాడుల్ని పెంచింది. అమెరికా ప్రత్యక్షంగా ఆయుధ సాయాన్నే గాక, సైన్యాన్ని కూడ పంపింది. గాజా ప్రజలపై దాడులు ఆపకుంటే తామూ చూస్తూ కూచోబోమని ఇరాన్ హెచ్చరించింది.

అమెరికా, బ్రిటన్‌లాంటి సామ్రాజ్యవాద దేశాలతో సహా అరబ్బు దేశాలన్నిటా, ప్రపంచంలోని శాంతికాముక శక్తులందరూ ఇజ్రాయెల్ దౌష్ట్యాల్ని ఖండిస్తూ వీధుల్లో కొచ్చారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించారు.

గాజాలోని ప్రజలకు నీరు, విద్యుత్తు వంటి సౌకర్యాలను నిలిపివేసి, ఇజ్రాయెల్ దిగ్బంధం చేసింది. గాజాలోని ఆసుపత్రిలో భీకర పేలుళ్ళు జరిపి వందలాదిమంది పాలస్తీనా ప్రజలను హతమార్చే దుర్మార్గానికి ఇజ్రాయెల్ పాల్పడింది. ఇజ్రాయెల్ పౌరుల్ని హమాస్ చంపుతోంది అని ప్రచారం చేస్తూ, తను మాత్రం జంకుగొంకూ లేకుండా సాధారణ ప్రజల్ని, పిల్లల్ని, వృద్ధుల్ని వేలాదిగా చంపుతోంది. గాజాను ఖాళీ చేయమని పాలస్తీనీయులకు అల్టిమేటం జారీ చేసింది.

ఈ దురాగతాల్ని ఖండిస్తూ, పాలస్తీనా భూభాగాల నుండి ఇజ్రాయెల్ వైదొలగి గత ఒప్పందాల ప్రకారం పాలస్తీనా స్వతంత్రంగా మనగలగడానికి తగిన వత్తిడిని పెంపొందించేందుకు, మనదేశంలో కూడ సంఘీభావాన్ని, మద్దతునూ కూడగడదాం. భారత ప్రభుత్వంపై, పాలక పార్టీలపై వత్తిడి తెద్దాం.

**19.10.23**

*విప్లవాభినందనలతో...*

**సి పి ఐ (ఎం-ఎల్)**

**ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కమిటీలు**